

నిర్మానుష్యంగా మారిన వనపర్తి పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా

డబ్బులే కావాలి..

వేలం వేసిన ధాన్యానికి బదులుగా ఇవ్వాలంటున్న గుత్తేదారు

- గతంలో 5.40 లక్షల టన్నుల ధాన్యం మాయమైనట్లు గుర్తింపు
- అలాంటి రైస్ మిల్లులకు కేటాయింపులు చేయకుండా నిషేధం
- తాజాగా వేలం ధాన్యం మాయం చేసిన మిల్లర్లకూ కేటాయింపు
- మిల్లుల సామర్థ్యానికి రెట్టింపుగా ధాన్యం కేటాయించాలని నిర్ణయం
- అన్‌లోడ్ కాకపోవడంతో రైస్ మిల్లుల వద్ద వాహనాల బారులు



నారాయణపేట జిల్లా మద్దూరు మండలంలోని ఓ రైస్‌మిల్లు వద్ద అన్‌లోడింగ్ కోసం బారులు తీరిన ట్రాక్టర్లు

మహబూబ్‌నగర్, మే 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : గత ప్రభుత్వం 2022-23 యాసంగి సీజన్‌కు సంబంధించి రైతుల నుంచి సేకరించి సీఎంఆర్ కోసం మిల్లర్లకు అప్పగించిన ధాన్యాన్ని వేలం వేసిన విషయం తెలిసిందే.. వేలం వేసే సమయంలో నిల్వల వివరాలను అధికారుల ద్వారా సేకరించగా రాష్ట్రవ్యాప్తంగా 314 రైస్‌మిల్లుల్లో దాదాపు 5.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం లేదని నిర్ధారించారు. 35 లక్షల టన్నులను ఈ సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం వేలం వేసింది. 25 లక్షల టన్నుల వరకు బిడ్డర్లు తీసుకున్నారు. ధాన్యం మాయమైన మిల్లర్లు ఆ ధాన్యానికి ఎంత అవుతుందో అది చెల్లించాల్సి ఉంది. అయితే టెండర్లు దక్కించుకొని చాన్నాళ్లవుతున్నా ఇప్పటివరకు ఆ ధాన్యాన్ని గుత్తేదార్లు పూర్తిగా తరలించలేదు. బదులుగా తమకు డబ్బులు కావాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఉదాహరణకు జోగుళాంబ గద్వాల జిల్లాలో 27 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వేలం వేయగా ఇప్పటివరకు 3 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే లిఫ్ట్ చేశారు. మిగతా 24 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లర్ల వద్దే నిల్వ ఉన్నది. నాగర్‌కర్నూలు జిల్లాలో 1.44 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వేలం వేయగా ఇంకా మిల్లర్ల వద్ద నుంచి 1.32 లక్షల మెట్రిక్ టన్నులు లిఫ్టు చేయాల్సి ఉంది. ఇలా రాష్ట్రంలోని ప్రతీ జిల్లాలో పరిస్థితి ఉన్నది. అప్పుడు ఉన్న ధర ఇప్పుడు లేకపోవడంతో టెండర్ దక్కించుకున్న వారు మిల్లర్లను డబ్బులే డిమాండ్ చేస్తున్న పరిస్థితులు ఉన్నాయి. అయితే వేలం సమయంలో ధాన్యం మాయం చేసిన రైస్‌మిల్లులకు ధాన్యం కేటాయించవద్దని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో వానాకాలం సీజన్‌లో కేటాయింపులు చేయలేదు. ఈ సీజన్‌లో కూడా మొన్నటి వరకు వాటిని వేలం ధాన్యం డిఫాల్ట్ మిల్లులుగా పరిగణించి కేటాయించలేదు. అయితే తాజాగా పౌరసరఫరాల శాఖ కమిషనర్ నుంచి భారీగా ధాన్యం పోటెత్తుతుందనే కారణం చూపి ఆక్షన్ పాడీ డిఫాల్ట్ మిల్లులకు కూడా కేటాయింపులు చేయండని ఆయా జిల్లాల అదనపు కలెక్టర్లకు సర్క్యులర్ పంపారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎంఆర్ ఇవ్వని మిల్లులు, క్రిమినల్ కేసులు నమోదైన మిల్లర్లు, ఆక్షన్ ప్యాడీ డీఫాల్ట్ మిల్లులకు కేటాయింపులు చేయవద్దని నిర్ణయించింది. అయితే ఇప్పుడు క్రిమినల్ కేసులు నమోదైన మిల్లులకు తప్పా మిగతా అందరికీ కేటాయింపులు చేయాలని నిర్ణయించడం గమనార్హం. ఇప్పటికే జిల్లాల్లో ధాన్యం కేటాయింపులు చేయడానికి రూ. కోట్లలో చేతులు మారుతున్న పరిస్థితులు ఉన్నాయి. నిబంధనల్లోని లొసుగులను వాడుకొని అధికారులు బ్లాక్ లిస్టెడ్ మిల్లులకు కేటాయింపులు చేసేస్తున్నారు.

సన్నరకాలకే ప్రాధాన్యం..

సాధారణంగా రా రైస్ మిల్లులకు దొడ్డు ధాన్యం కేటాయించారు. కేవలం బాయిల్డ్ రైస్ మిల్లులకు మాత్రమే కేటాయిస్తారు. అయితే విపరీతంగా పెరుగుతున్న ధాన్యం ఉత్పత్తితో రా రైస్‌మిల్లులకు కూడా దొడ్డు ధాన్యం తీసుకోవాలని అధికారులు ఒత్తిడి చేస్తున్న పరిస్థితి ఉన్నది. సమయానికి సీఎంఆర్ ఇచ్చిన రా రైస్‌మిల్లర్లకు కూడా దొడ్డు ధాన్యమే కేటాయిస్తామని చెబుతున్నారు. దొడ్డు ధాన్యం రా మిల్లులో ఆడించడం వల్ల యాసంగి గింజ విరిగిపోయి ఎక్కువ నూక వచ్చే అవకాశం ఉంటుంది. అదే బాయిల్డ్ మిల్లులో పెద్దగా వేస్టేజ్ ఉండదు. యాసంగి సీజన్‌లో ఎక్కువగా దొడ్డురకాలనే రైతులు సాగుచేస్తారు. సన్నరకాలను కేవలం వానాకాలంలోనే ఎక్కువగా వేస్తారు. ఇప్పుడొచ్చిన దొడ్డు రకాలను తీసుకోవాలని ఒత్తిడి చేస్తుండటంతో రా రైస్‌మిల్లర్లు ధాన్యం తీసుకోవడానికి ముందుకు రావడం లేదు.

నిల్వకు చోటేది..

ఏళ్లకు ఏళ్లు సీఎంఆర్ పెండింగ్‌లో

(మిగతా 6లో..)



నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలో వర్షం భయంతో ధాన్యాన్ని కప్పి ఉంచిన రైతులు



పిలుపొస్తే యుద్ధానికి సిద్ధం

- 'ఆపరేషన్ సిందూర్' చరిత్రాత్మకం
- భారత సైన్యానికి అండగా నిలవాలి
- రిటైర్డ్ ఆర్మీ జవాన్లు, అధికారులు

6



సంగమేశ్వర ఆలయం వద్ద భక్తులకు నీడ వసతి

7

భానుడి భగభగలు..

- వనపర్తి జిల్లా కొత్తకోటలో 40.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

వనపర్తి/నారాయణపేట, మే 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎండ తీవ్రత కాస్త తగ్గింది. నాలుగు రోజులుగా 42 డిగ్రీలకు పైగా నమోదైన గరిష్ఠ ఉష్ణోగ్రత 40 డిగ్రీలకు తగ్గింది. బుధవారం వనపర్తి జిల్లాలోని కొత్తకోట మండలంలో 40.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అత్యల్పంగా శ్రీరంగాపూర్ మండలంలో 25.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జోగుళాంబ గద్వాల జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రత 40 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 24.4 డిగ్రీలు నమోదైంది. మహబూబ్‌నగర్ జిల్లాలో గరిష్ఠం 39.9, కనిష్ఠం 26.3 డిగ్రీలు, నారాయణపేట జిల్లాలో గరిష్ఠంగా 37 డిగ్రీలు, కనిష్ఠంగా 26 డిగ్రీలు నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో గరిష్ఠంగా 37 డిగ్రీలు, కనిష్ఠంగా 26 డిగ్రీలు నమోదైంది.



నిర్మానుష్యంగా వనపర్తి పట్టణంలోని గోపాల్ పేటకు వెళ్లే ప్రధాన రహదారి

గుర్రంపై ఎమ్మెల్యే బండ్ల స్వారీ

గద్వాల న్యూటౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి సమ్మర్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌కు చెందిన లెర్న్ ఓ రామ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విశ్వం సమ్మర్ క్యాంపును బుధవారం ఆయన గద్వాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా గుర్రంపై స్వారీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో పుస్తకాలకే పరిమితమైన విద్యార్థులు వేసవి సెలవుల్లో విజ్ఞానంతో పాటు వినోదాన్ని పెంచేందుకు ఈ క్యాంపు ఉపయోగపడుతుందన్నారు. ఈ క్యాంపులో ప్రత్యేకంగా గుర్రపు సవారీ కూడా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పత్తి శ్రీధర్, ప్రవేట్ పాఠశాలల అధ్యక్షుడు బాబు నాయుడు తదితరులు ఉన్నారు.



గుర్రం మీద గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

రైతులు ఇబ్బంది పడొద్దు

ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్



తిమ్మాయిపల్లి వద్ద ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

చారకొండ, మే 7 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా నిబంధనల మేరకు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ, జూపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని, కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో 83 మంది రైతుల నుంచి 285 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు భీమయ్యగౌడ్ తెలిపారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ అద్దంకి సునీత, ఆర్‌ఐ భరత్, సొసైటీ సిబ్బంది, రైతులు ఉన్నారు.

బావిలో పడి ఉపాధి కూలీ మృతి

- తోటి కూలీలకు నీరు తెచ్చేందుకు వెళ్లగా అందులో పడిన మహిళ
- వనపర్తి జిల్లా నాటవెల్లిలో ఘటన

7

బ్రీడింగ్ చెక్కర్లకు అందని వేతనాలు

- ప్రతీ ఏడాది ఐదు నెలలు మాత్రమే పని
- గతేడాది చేసిన పనికి అందని డబ్బు



వనపర్తి : సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న బ్రీడింగ్ చెక్కర్లు (ఫైల్)

7

ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

- వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త డాక్టర్ సిద్దప్ప

7



గద్వాల పట్టణం

ఆస్తి పన్ను వసూలుకు ఆదరణ

- గద్వాల జిల్లాలోని 4 పట్టణాల్లో రూ.2.30 కోట్లు వసూలు
- ముందస్తుగా చెల్లించడంతో రూ.11 లక్షలకు పైగా ఆదా

గద్వాలటౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పట్టణ పరిధిలోని ఆస్తులపై ముందస్తు పన్ను చెల్లించే వారి కోసం ప్రకటించిన రాయితీకి మంచి ఆదరణ లభించింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పట్టణ ప్రాంతాల్లో అడ్వాన్స్‌గా పన్నుచెల్లించిన వారికి పన్నులో ఐదుశాతం రాయితీ ప్రకటించింది. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రం గద్వాలతో పాటు అలంపూర్, అయిజ, వడ్డేపల్లి మునిసిపల్ పట్టణాల్లో మొత్తం 26వేలకు పైగా ఆస్తులు ఉండగా వాటిలో 6,496 ఆస్తులకు సంబంధించి ముందస్తు పన్ను రూ.2.30 కోట్లు వసూలైంది. దీంతో పన్ను చెల్లించిన వారికి రూ.11.56లక్షల మేరకు ఆదా అయ్యిందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. పన్ను వసూళుకు సంబంధించి గద్వాలలో 2,952 ఆస్తులపై రూ.1.51కోట్లు, అయిజలోని 1,924 ఆస్తులపై రూ.37.20 లక్షలు, అలంపూర్‌లో 562 ఆస్తులపై రూ.12.18లక్షలు, వడ్డేపల్లిలో 1,056 ఆస్తులపై రూ.31.08లక్షలు వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వం పొడగించిన రాయితీ గడువు బుధవారంతో ముగిసిందని అధికారులు తెలిపారు.

సన్నాలకు బోనస్ ఏదీ..?

- డబ్బుల కోసం ఎదురు చూస్తున్న రైతులు
- జిల్లాలో ఇప్పటికే సేకరించిన ధాన్యం 47,362 మెట్రిక్ టన్నులు
- చెల్లించాల్సిన బోనస్ డబ్బులు రూ.27 కోట్లు
- అసంతృప్తిలో అన్నదాతలు

వనపర్తి, మే 7 (ఆంధ్రజ్యోతి) : సన్న రకం ధాన్యాన్ని ప్రభుత్వానికి విక్రయించి నెల రోజులు అవుతున్నా.. బోనస్ డబ్బులు తమ ఖాతాలో జమ కాలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు క్వింటాల్ సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించింది. ఇచ్చిన హామీ మేరకు వానకాలం సీజన్‌లో బోనస్ రైతుల ఖాతాలలో జమ చేసింది. కానీ యాసంగి సీజన్ ప్రారంభమై దాదాపు నెలరోజులైనా బోనస్ డబ్బులు రైతుల ఖాతాలో జమ చేయలేదు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 47,362 మెట్రిక్ సన్న రకం ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి బోనస్ డబ్బులు రూ.27 కోట్లు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. ఈ ధాన్యం విక్రయించి నెల రోజులు అవుతున్నా రైతుల ఖాతాల్లో బోనస్ డబ్బులు జమ చేయకపోవడం, ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



వనపర్తి మార్కెట్‌లో ధాన్యం తూకం చేస్తున్న కూలీలు

బోనస్ డబ్బులు జమ కాలేదు



ధాన్యం విక్రయించి 25 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు బోనస్ డబ్బులు జమ కాలేదు. మూలమల్లలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో 120 క్వింటాళ్ల ధాన్యాన్ని విక్రయించాను. వారం రోజుల క్రితం ధాన్యం డబ్బులు జమ అయ్యాయి. కానీ బోనస్ డబ్బులు జమ కాలేదు.

- గట్టు బాలరాజు రైతు, మూలమల్ల గ్రామం, ఆత్మకూరు

రైతుల జాబితాను పంపించాం

యాసంగి సీజన్‌కు సంబంధించి సన్న రకం ధాన్యం విక్రయించిన రైతుల జాబితాను ప్రభుత్వానికి పంపించాం. జాబితా ఆధారంగా త్వరలోనే రైతుల ఖాతాలో బోనస్ డబ్బులు జమ అయ్యే అవకాశం ఉంది. ధాన్యం డబ్బుల విషయంలో ఎలాంటి ఆలస్యం జరగడం లేదు.

- జగన్మోహన్, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి



వనపర్తి మార్కెట్ యార్డులో ధాన్యం పంచులకు ఎంపుతున్న కూలీలు

విద్యుదాఘాతంతో రైతు మృతి



వెంకటయ్య (ఫైల్)

నవాబ్‌పేట, మే 7 (ఆంధ్రజ్యోతి) : పనికి వెళ్లిన ఓ రైతు విద్యుదాఘాతంతో మృతి చెందిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని కామారం గ్రామ శివారులో చోటుచేసుకున్నది. ఎస్‌ఐ విక్రం కథనం ప్రకారం సిద్దోటం గ్రామానికి చెందిన కోస్గి వెంకటయ్య (75) నాలుగు సంవత్సరాలుగా కామారం గ్రామ శివారులో ఉన్న ఓ మామిడి తోటలో పనిచేస్తూ అక్కడే జీవనం సాగిస్తున్నాడు. అయితే సోమవారం పని నిమిత్తం ఇంటి నుంచి మామిడి తోటకు వెళ్లి మళ్లీ ఇంటికి వెళ్లకపోవడంతో మంగళవారం భర్త ఆచూకీ కోసం ఆయన భార్య బుచ్చమ్మ వెతకగా ఎక్కడా కనపడలేదు. బుధవారం స్థానికుల సమాచారంతో కుటుంబ సభ్యులు మామిడి తోటకు వెళ్లి చూడగా అక్కడ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ పక్కన విద్యుదాఘాతంతో వెంకటయ్య చనిపోయి పడినట్లు గుర్తించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

'అవకాశం ఇస్తే, పిలుపు వస్తే మళ్లీ సైన్యంలో చేరతాం. పాకిస్థాన్‌తో యుద్ధానికి సిద్ధంగా ఉన్నాం' అని భారత మాజీ సైనికులు, అధికారులు స్పష్టం చేశారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా భారత సైన్యం 'ఆపరేషన్ సిందూర్' పేరుతో మంగళవారం అర్ధరాత్రి తర్వాత మెరుపు దాడి చేసింది. పాకిస్థాన్, పీవోకేలోని 9 ఉగ్రవాద శిబిరాలను నేలమట్టం చేసింది. పదుల సంఖ్యలో ఉగ్రవాదులను మట్టుపెట్టింది. ఈ సందర్భంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పలువురు రిటైర్డ్ ఆర్మీ జవాన్లు, అధికారులను 'ఆంధ్రజ్యోతి' పలుకరించింది. వారి మనోభిప్రాయాన్ని తెలుసుకున్నది. వివరాలు వారి మాటల్లోనే...

- గద్వాల సర్కిల్/ వనపర్తి టౌన్/ వనపర్తి / రాజీవ్‌చౌరస్తా/ కందనూలు/ అచ్చంపేట టౌన్/ మరికల్/ నారాయణపేట/ కోస్గి/ మక్తల్ రూరల్/ మహబూబ్‌నగర్ న్యూటౌన్/ అమరచింత, (ఆంధ్రజ్యోతి)

పిలుపొస్తే యుద్ధానికి సిద్ధం



- 'ఆపరేషన్ సిందూర్' చరిత్రాత్మకం
- భారత సైన్యానికి అండగా నిలవాలి
- రిటైర్డ్ ఆర్మీ జవాన్లు, అధికారులు



మెరుపు దాడులు శుభపరిణామం



భారత సైన్యం 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్‌లోని ఉగ్ర శిబిరాలపై మెరుపుదాడి చేయడం శుభపరిణామం. నేను 1999 కార్గిల్ యుద్ధంలో పాల్గొన్నాను. 2021లో ఆర్మీ నుంచి రిటైర్డ్ అయినా, భారత ప్రభుత్వం అవకాశం ఇస్తే మళ్లీ సైన్యంలో చేరేందుకు సిద్ధం. రిటైర్డ్ అయిన 10 మంది సభ్యులం కలిసి ఇప్పటికే సికింద్రాబాద్‌లోని ఆర్మీ ఆఫీస్‌లో ఈఎంబీ రికార్డుకు దరఖాస్తు చేసుకున్నాం. రిటైర్డ్ అయిన తాము దేశ సేవ కోసం మళ్లీ ఆర్మీలో వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాం.

- నంగి మణివర్ధన్ రెడ్డి, రిటైర్డ్ ఆర్మీ, మస్తిపూర్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



పహల్గాం ఉగ్రదాడి అమానుషం. అందుకు ప్రతిగా భారత సైన్యం 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్, ఆక్రమిత కశ్మీర్‌పై మెరుపుదాడి చేయడం సంతోషకరం. పాకిస్థాన్ మరోసారి కవ్వింపు చర్యలకు దిగితే ప్రతీకారం ఇంతకు మించి ఉంటుంది. అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రభుత్వం దేశవ్యాప్తంగా మాక్‌డ్రిల్ నిర్వహించింది. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి ప్రభుత్వానికి సహకరించాలి.

- జి.నాగేశ్వర్, మాజీ సైనికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి


దేశం కోసం పోరాడేందుకు సిద్ధం



దేశం కోసం పిలుపు వస్తే మళ్లీ యుద్ధరంగంలో పోరాడేందుకు సిద్ధంగా ఉన్నాం. ఆర్మీ జవాన్‌గా 18 సంవత్సరాల పాటు రాజస్థాన్, సిక్కిం, పంజాబ్, జమ్ము కశ్మీర్‌లలో విధులు నిర్వర్తించాను. ఇటీవల పహల్గాం దాడి తర్వాత పాకిస్థాన్ భూభాగంలోని 9 స్థావరాలపై జరిపిన దాడితో భారత్ సత్తా ఏమిటో వారికి అర్థమై ఉంటుంది. పాకిస్థాన్‌తో యుద్ధం చేసేందుకు మేము సిద్ధంగా ఉన్నాం.

రవి కుమార్, రిటైర్డ్ ఆర్మీ జవాన్, అచ్చంపేట

తగిన మూల్యం చెల్లించక తప్పదు



ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్న దాయాది దేశం పాకిస్తాన్ తగిన మూల్యం చెల్లించక తప్పదు. మతోన్మాదంతో అమాయకుల ప్రాణాలు తీసిన ఉగ్రవాదులకు ఇండియన్ ఆర్మీ ఆపరేషన్ సిందూర్ పేరిట గుణ పాఠం చెప్పింది. ఉగ్రవాదులను తుదముట్టించడమే లక్ష్యంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ చారిత్రాత్మక నిర్ణయం. దేశమే కాదు యావత్తు ప్రపంచం హర్షించాల్సిందే.

- కృష్ణారెడ్డి, రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్, గద్వాల

సైన్యానికి అండగా నిలుద్దాం



దేశం మొత్తం భారత సైన్యానికి అండగా నిలవాలి. పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రమూకలు చేసిన హింసకాండకు ప్రతిచర్యగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు జాతి, మత, కుల బేధాలు లేకుండా, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతీ ఒక్కరం మద్దతుగా నిలవాలి. భారతదేశం వైపు చూడా లంటేనే పాకిస్తాన్ ఉగ్రవాదులకు వెన్నులో వణుకు పుట్టాలి.

- ఇటిక్యాల బండలయ్య, రిటైర్డ్ సైనికుడు, వనపర్తి


ఆర్మీకి అండగా ఉంటాం



దాయాది దేశమైన పాకిస్తాన్ పహల్గామ్‌లో ఉన్మాదానికి పాల్పడడం మానవ జాతి సిగ్గు పడాల్సిన అంశం. ఉగ్రమూకలపై భారత్ సైన్యం చేసిన దాడి సర్వత్రా హర్షణీయం. వారికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది.

- ఎంపీ మల్లురవి, నాగర్‌కర్నూల్

సైన్యానికి అన్ని వర్గాల మద్దతు



భారతదేశ సార్వభౌమత్వాన్ని ఎవరూ కించపరచాలని చూసినా దేశ ప్రజలు ఊరుకోరు. ఆపరేషన్ సిందూర్ పేరుతో పాక్ ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం చేసిన దాడులకు కులాలు, మతాలు, వర్గాలు, పార్టీలకు అతీతంగా మద్దతు తెలపాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

- చిక్కుడు వంశీకృష్ణ, అచ్చంపేట ఎమ్మెల్యే

పాక్‌కు గుణపాఠం



భారతదేశాన్ని తక్కువ అంచనా వేసిన పాక్‌కు సైన్యం తగిన రీతిలో బుద్ధి చెప్పింది. ఇందుకు కాంగ్రెస్ పార్టీ పూర్తిగా మద్దతు తలుపుతోంది. అవసరమైతే ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త భారత్ సైన్యానికి అండగా ఉంటాడు.

- కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్యే, నాగర్‌కర్నూల్

దేశ సమైక్యతను దెబ్బతీయలేరు



భిన్న జాతులు, తెగలు, కులాలు, మతాలున్న భారత దేశ రక్షణ విషయంలో రాజీ పడేవారు ఎవరూ లేరు. ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్తాన్ రుచి చూసింది కేవలం ఒక శాతం మాత్రమే. ముందు ముందుంది ముసళ్ల పండుగ. భారత్ సైన్యానికి కాంగ్రెస్ పార్టీ పూర్తి సంఘీభావాన్ని, సహకారాన్ని అందిస్తుంది.

- కశిరెడ్డి నారాయణరెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే

ఉగ్రవాద నిర్మూలనే లక్ష్యం



ఆక్రమిత కశ్మీర్‌లో అనేక దుశ్చర్యలకు పాల్పడుతూ పాకిస్థాన్ భారతదేశ ప్రజల సహనాన్ని పరీక్షించింది. పాక్ తన వైఖరిని మార్చుకోకుంటే భారత సైన్యం నుంచి కఠినమైన పరిణామాలు ఉంటాయని సంకేతాలు వెళ్లాలి. ఇందు కోసం ప్రతీ ఒక్కరు ఇండియన్ ఆర్మీకి అండగా నిలబడాలి.

- మర్రి జనార్దన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

వైమానిక దాడి మంచిదే



ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రవాదుల స్థావరాలపై వైమానిక దాడులు చేయడం మంచిదే. ఉగ్రవాదులపై మరిన్ని దాడులు చేయాలి. కఠినంగా శిక్షించాలి. పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనం చేసుకునే అవకాశం వచ్చింది చేసుకోవాలి. ఇది ప్రతీ ఒక్కరు గర్వించదగ్గ విషయం.

- మహేందర్ రిటైర్డ్ జవాన్, హన్వాడ

ఇది భారత ప్రజల విజయం



ఆపరేషన్ సిందూర్ భారత ప్రజల విజయం. ఈ ఆపరేషన్‌తో భారత శక్తిని పాకిస్తాన్ రుచి చూసింది. పార్టీలకు, ప్రాంతాలకు, కుల మతాలకు అతీతంగా భారతీయులమందరం ఐక్యత చాటాల్సిన సందర్భం ఇది. ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రమూకల నిర్మూలన విజయవంతం కావడం హర్షణీయం. భారత సైనికులకు సెల్యూట్ చేస్తు న్నాం.

- పలుస శంకర్ గౌడ్, సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు, వనపర్తి

యుద్ధానికి నేను సిద్ధం



పాకిస్థాన్‌పై యుద్ధానికి సిద్ధంగా ఉన్నాం. 2002లో ఆర్మీలో చేరిన నేను, 17 సంవత్సరాలు విధులు నిర్వర్తించాను. ఆ సమయంలో యుద్ధం జరగలేదు. ఇప్పుడు పాకిస్థాన్‌పై యుద్ధం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పిస్తే వెంటనే బయలుదేరుతాను. మాతృభూమి సంరక్షణ కోసం ఎప్పుడూ సిద్ధంగా ఉంటాను.

- తిరుపతయ్య, మాజీ సైనికుడు, అప్పంపల్లి

కార్గిల్ యుద్ధంలో 3 బుల్లెట్లు



కార్గిల్ యుద్ధంలో పాల్గొన్నప్పుడు కుడి చేయి కింది భాగంలో మూడు బుల్లెట్లు దిగాయి. చేయి విరిగింది. అలాంటి భయంకర పరిస్థితుల్లోనూ దేశం కోసం ప్రాణాలను లెక్కచేయకుండా పోరాడాం. ఇప్పుడు దేశమంతా సైనికులకు అండగా నిలవాల్సిన సమయం ఆసన్నమైంది. 1990 నుంచి 2011 వరకు ఆర్మీలో పని చేసిన నేను హవల్దార్‌గా రిటైర్డ్ అయ్యాను.

- వెంకటయ్య, రిటైర్డ్ హవల్దార్

మళ్లీ ఆర్మీలో చేరతాం



ఆపరేషన్ సిందూర్‌ను స్వాగతిస్తున్నాం. దేశం కోసం అవసరమైతే మళ్లీ సైన్యంలో చేరేందుకు సిద్ధం. అమాయక ప్రజల ప్రాణాలు తీసిన ఉగ్రవాదులకు మన సైన్యం సరైన గుణపాఠం నేర్పింది. దేశ ప్రజలందరూ త్రివిధ దళాలకు అండగా ఉండాలి.

- మాకం శ్రీనివాసులు, మాజీ సైనికుడు, నాగర్‌కర్నూల్

ప్రధాని మోదీకి ధన్యవాదాలు



ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ భారత్‌ను నేరుగా ఎదుర్కోలేక అమాయక ప్రజల ప్రాణాలు తీశారు. ఆర్మీకి పూర్తి స్వేచ్ఛ ఇచ్చిన ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు. ఆపరేషన్ సిందూర్‌ను స్వాగతిస్తున్నాం. ఉగ్రవాదాన్ని పూర్తిగా అంతం చేసేంత వరకు దీనిని కొనసాగించాలి.

- జి.సాయన్న, రిటైర్డు మిలిటరీ మ్యాన్, మక్తల్

ఉగ్రవాదుల్ని ఏరి పారేయాలి



ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌కు తగిన గుణపాఠం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది. ఉగ్రమూకలను పూర్తి స్థాయిలో ఏరిపారేయాలి. పాకిస్తాన్‌లోని ఉగ్ర స్థావరాలపై భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను స్వాగతిస్తున్నాం. కశ్మీర్ సరిహద్దులో 22 ఏళ్ల విధులు నిర్వర్తించి, 2003 ఉద్యోగ విరమణ చేశాను.

- పి.మాణికప్ప, బీఎస్ఎఫ్ రిటైర్డ్ ఎస్ఐ


శత్రుదేశానికి ఇది గుణపాఠం



శత్రు దేశానికి ఆపరేషన్ సిందూర్ ఒక గుణపాఠం. భారతదేశంతో పెట్టుకుంటే ఎంతటి వారినైనా క్షమించేది లేదు. పాక్‌లోని ఉగ్ర శిబిరాలపై దాడులు హర్షణీయం. దేశం కోసం మరోసారి సైన్యంలో చేరుతాను.

- హెచ్.గోపాల్‌రెడ్డి, మాజీ సైనికుడు, నాగర్‌కర్నూల్

మాజీల సేవలను వినియోగించుకోవాలి



భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు అవసరమైతే మాజీ సైనికుల సేవలను వినియోగించుకోవాలి. ఆపరేషన్‌ను అడ్డుకునేందుకు పాక్ సైన్యం ప్రయత్నిస్తే వారిపైనా సైన్యం దాడులు చేయాలి. నేను 1986 నుంచి 2001 వరకు సైన్యంలో పని చేశాను. ఆర్మీ నుంచి ఎప్పుడు పిలుపు వచ్చినా ఆపరేషన్‌లో పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నాను. దేశ రక్షణకు తమ వంతు సహకారం అందించేందుకు దేశరక్షణలో తమ వంతు సహకారం అందించేందుకు ఎంతోమంది మాజీ సైనికులు సంసిద్ధత వ్యక్తం చేస్తున్నారు. మన దేశం సురక్షితంగా ఉండాలన్నదే మా ఆకాంక్ష.

- వెంకటయ్య గౌడ్, మాజీ సైనికుడు



నాగర్‌కర్నూల్ జిల్లాలో హై అలర్ట్

నాగర్‌కర్నూల్, మే 7 (ఆంధ్రజ్యోతి) : భారత్, పాకిస్థాన్‌ల మధ్య యుద్ధ వాతావరణం నెలకొనడం, బుధవారం తెల్లవారుజామున భారత సైన్యం పాకిస్థాన్‌లోని ఉగ్రవాదుల స్థావరాలపై దాడి చేసిన నేపథ్యంలో నాగర్‌కర్నూల్ జిల్లాలో హైఅలర్ట్ ప్రకటించారు. ఎలాంటి ఘటనలు జరిగినా పోలీసులు, ఆర్మ్‌డ్, రిజర్వ్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది తక్షణం స్పందించేలా కార్యాచరణను రూపొందించారు. జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, అడిషనల్ ఎస్పీ సీహెచ్ రామేశ్వర్‌తో సహా డీఎస్పీలు, సీఐలు అందరూ అప్రమత్తంగా ఉండాలని పోలీస్ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి.

శ్రీశైలం ప్రాజెక్టుపై కట్టుదిట్టమైన భద్రత

ఉగ్రవాద స్థావరాలపై భారత్ దాడి నేపథ్యంలో ప్రతీకార చర్యగా పాకిస్తాన్ ప్రతిదాడులకు పాల్పడవచ్చునని ఇంటలిజెన్స్ వర్గాలు చేసిన హెచ్చరికల నేపథ్యంలో శ్రీశైలం ప్రాజెక్టు వద్ద ఉభయ తెలుగు రాష్ట్రాలు భద్రతను కట్టుదిట్టం చేశాయి. శ్రీశైలం కుడి, ఎడమగట్టు జల విద్యుత్పాదన కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. ఆర్మీకి చెందిన ముఖ్య అధికారులు స్థానిక పోలీస్ ఉన్నతాధికారులతో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, పాలమూరు ప్రాజెక్టులపై కూడా నిఘా కొనసాగుతోంది. ఎప్పుడు, ఎలాంటి ఉపద్రవం ఎదురైనా సిద్ధంగా ఉండేందుకు పోలీస్ యంత్రాంగం సమాయత్తం అయ్యింది.

నాణ్యతా ప్రమాణాలు ఉల్లంఘిస్తే చర్యలు



టిఫిన్ సెంటర్ పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు

పెబ్బేరు, మే 7 (ఆంధ్రజ్యోతి); హోటళ్ల నిర్వాహకులు నాణ్యతా ప్రమాణాలు, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ యోగేష్ కుమార్ హెచ్చరించారు. బుధవారం మునిసిపాలిటీలోని హోటళ్ల, టిపిన్ సెంటర్లలో సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం, హోటళ్లలో పరిశుభ్రత పాటించని నిర్వాహకులకు రూ.2800 జరిమానా విధించినట్లు తెలిపారు. నిర్వాహకులు రోజువారిగా చట్నీలు, ఆహారపదార్థాలు తయారు చేసుకోవాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలు, నిబంధనలు ప్రతీ ఒక్కరు తప్పకుండా పాటించాలని తెలిపారు. సిబ్బంది రాజు, కృష్ణ తదితరులున్నారు.

జిల్లా సరిహద్దులో 6 చెక్‌పోస్టులు





జిలాల్‌పూర్ చెక్‌పోస్టు దగ్గర వాహనాలు తనిఖీ చేస్తున్న డీఎస్పీ

- కర్ణాటక ధాన్యం రాకుండా చర్యలు
- నారాయణపేట డీఎస్పీ లింగయ్య

నారాయణపేట, మే 7 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా సరిహద్దులో 6 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ లింగయ్య తెలిపారు. నారాయణపేట మండలం, జిలాల్‌పూర్ వద్దనున్న చెక్‌పోస్టును బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వర్తించే పోలీసు, రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కర్ణాటక నుంచి వచ్చే ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలని, ధాన్యం లారీలు జిల్లాలోకి రాకుండా చూడాలని సూచించారు. వాహనాల నెంబర్లను రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ధాన్యం లోడ్‌తో వచ్చే వాహనాలను రెవెన్యూ అధికారులకు అప్పగించాలని సూచించారు.

డబ్బులే కావాలి..

(5వ పేజీ తరువాయి)

పెట్టుకోవడం, ధాన్యం రైస్‌మిల్లుల గోదాములతో పాటు ప్రభుత్వ గోదాముల్లో భారీగా నిల్వ ఉండటంతో ప్రతీ సీజన్‌లో వస్తున్న ధాన్యం నిల్వ చేసుకోవడానికి చోటే లేకుండా పోతోంది. సైకిల్ మాదిరిగా ఎప్పటికప్పుడు సీఎంఆర్ అప్పగిస్తే ఇబ్బంది ఉండేది కాదు. ఇవి కాకుండా 2022-23 యాసంగి సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం వేలం వేసిన ధాన్యాన్ని ఇంకా గుత్తేదారులు తరలించకపోవడంతో కూడా చోటు కొరత ఏర్పడింది. ఉదాహరణకు వనపర్తి జిల్లాలో కొనుగోలు కేంద్రాలకు 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా ఉండగా కేవలం లక్ష మెట్రిక్ టన్నులకు మాత్రమే నిల్వ చేసుకోవడానికి అవకాశం ఉంది. ఇలా అన్ని జిల్లాల్లోనూ సమస్య ఉన్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం గతంలో చేసిన విధానంలోనే మిల్లుల కెపాసిటీకి మించి ధాన్యం కేటాయింపులు చేయాలని నిర్ణయించింది. కెపాసిటీకి మించి కేటాయింపుల వల్లే మిల్లర్లు సమయానికి సీఎంఆర్ ఇవ్వడంలేదని విమర్శలు ఉన్నాయి. దాదాపు రెట్టింపు కేటాయింపులు చేయాలని, ఉదాహరణకు 1000 మెట్రిక్ టన్నుల కేటాయించే మిల్లుకు 2 వేల మెట్రిక్ టన్నులు ఇకపై కేటాయించనున్నారు. ధాన్యం నిల్వకు చోటు లేకపోవడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ప్రస్తుత చర్యల వల్ల డీఫాల్ట్ మిల్లర్లపై ఉక్కుపాదం ఉట్టిమాటలుగానే మారాయి.

క్రైం కార్నర్

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

మరికల్, మే 7 (ఆంధ్రజ్యోతి) : ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన ఓ యువకుడు నారాయణపేట జిల్లాలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మరికల్ మండలం పసుపుల గ్రామ సమీపంలో ఈ సంఘటన జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన యువకుడు బుడ్డు (27) కొంతకాలంగా పసుపుల గ్రామంలో బోరుబండిపై పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఉదయం అతడు మద్యం మత్తులో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు బోరుబండి యజమాని కృష్ణారెడ్డి రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

జక్లేర్‌లో వివాహిత..

మక్తల్ రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి) : క్షణికావేశంలో ఓ వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. నారాయణపేట జిల్లా, మక్తల్ మండలం జక్లేర్‌లో ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ భాగ్య లక్ష్మీ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొంకలి జయ మ్మ (34) మంగళవారం మద్యం తాగి పొలం వద్దకు వెళ్లింది. దీంతో భర్త కొంకలి శివ ఆమెను మందలించాడు. ఇలా మద్యానికి అలవాటు పడితే సంసారం ఎలా నడుస్తుందంటూ ఆగ్రహం వ్యక్తం చేసి, పులిమామిడి సంతకు వెళ్లిపోయాడు. దీంతో క్షణికావేశానికి గురైన జయమ్మ పొలంలోని వేపచెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ మేరకు ఆమె తమ్ముడు సందుల కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ధాన్యం ట్రాక్టర్‌ను ఢీకొన్న బైక్

▸▸ వాహనదారుడి మృతి

ఊట్కూర్, మే 7 (ఆంధ్రజ్యోతి) : నిలిపిఉన్న ట్రాక్టర్‌ను ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. నారాయణపేట జిల్లా, ఊట్కూరు మండలంలో ఈ సంఘటన జరిగింది. ఊట్కూర్ ఎస్‌ఐ కృష్ణంరాజు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కంసాని రాజు (46) నారాయణపేట పట్టణంలోని ఒక హోటల్‌లో పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి పని పూర్తి చేసుకొని ద్విచక్రవాహనంపై గ్రామానికి బయలుదేరాడు. ఓబ్లాపూర్ గేటు వద్దనున్న మిల్లు సమీపంలో రోడ్డు అంచున నిలిపివున్న ట్రాక్టర్‌ను గమనించకుండా నేరుగా వచ్చి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి కుటుంబసభ్యులకు, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకొన్నారు. పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని మృతదేహాన్ని నారాయణపేట ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, నలుగురు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బావిలో పడి ఉపాధి కూలీ మృతి

కొత్తకోట మే 7 (ఆంధ్రజ్యోతి) : నీరు తెచ్చేందుకు బావికి వెళ్లిన ఉపాధి కూలీ ప్రమాదవశాత్తు జారి నీటిలో పడి మృతి చెందింది. వనపర్తి జిల్లా, కొత్తకోట మండలం, నాటవెల్లిలో బుధవారం ఈ సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన పద్మమ్మ (45) ఉపాధి హామీ పనికి వెళ్లింది. టెంటు వేసిన తర్వాత తోటి కూలీల కోసం నీరు తెచ్చేందుకు బిందెతో సమీపంలోని బావి వద్దకు వెళ్లింది. ఎంత సేపైనా ఆమె తిరిగి రాకపోవడంతో కూలీలు బావి వద్దకు చేరుకున్నారు. బావిలో గాలించగా ఆమె మృతదేహం లభించింది. దీంతో వారు కుటుంబసభ్యులు, గ్రామస్థులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రికి తరలిం చారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీచుపల్లియాదవ్ పరామర్శించారు.

ట్రాక్టర్ దగ్ధం



దగ్ధమైన ట్రాక్టర్

మల్దకల్, మే 7 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, మల్దకల్ మండలంలోని విఠలాపురం గ్రామానికి చెందిన రైతు బైలర్ ఆనంద్‌కు చెందిన ట్రాక్టర్ ప్రమాదవశాత్తు దగ్ధమైంది. మంగళవారం రాత్రి ట్రాక్టర్‌ను పొలం వద్ద ఉంచి ఆనంద్‌కు ఇంటికి చేరుకున్నాడు. ఉదయం వెళ్లే సరికి అది కాలిపోయి కనిపించింది. సంఘటనపై ఎస్‌ఐ నందీకర్‌కు సమాచారం ఇవ్వగా, ఆయన సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితుడితో మాట్లాడి వివరాలు సేకరించారు.

పశుగ్రాసం, బోరు మోటార్లు దగ్ధం



కడుకుంట్ల గ్రామ శివారులో దగ్ధమై బూడిదైన పశుగ్రాసం, బోరు మోటార్లు

వనపర్తి రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి) : పశుగ్రాసం, బోరు మోటర్లు, స్ప్రింక్లర్ పైపులు దగ్ధమయ్యాయి. వనపర్తి జిల్లా, మండల పరిధిలోని పెద్దగూడెం శివారులో బుధవారం ఈ సంఘటన జరిగింది. బాధిత రైతులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కుమ్మరి కోటమ్మ, గోపాల్ తమ పొలాల్లో వరి కోతల తర్వాత గడ్డిని కట్టలు కట్టి పశుగ్రాసం కోసం పొలంలో నిల్వ చేసుకున్నారు. పశుగ్రాసానికి ప్రమాదవశా త్తు మంటలు అంటుకోవడంతో బోరు మోటర్లు, స్ప్రింక్లర్ పైపులు కాలి బూడిదయ్యాయి. దీంతో దాదాపు రూ. 2 లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగిందని బాధితులు తెలిపారు. ప్రభుత్వపరంగా ఆదుకోవాలని కోరారు.

ద్విచక్ర వాహనాలు ఢీ

- ఒకరు మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు

అయిజ, మే 7 (ఆంధ్రజ్యోతి) : ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు మృతి చెందారు. ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామ సమీపంలో బుధవారం రాత్రి ఈ సంఘటన జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వడ్డేపల్లి మండలంలోని తనగల గ్రామానికి చెందిన త్రివేణ్ (25), శివ, రఘు ద్విచక్రవాహనంపై తనగల నుంచి వెంకటాపూర్ స్టేజీ వైపు వెళ్తున్నారు. అదే ఊరికి చెందిన రామానాయుడు గ్రామానికి వస్తున్నారు. రెండు వాహనాలు ఎదురెదురుగా వస్తూ కిష్టాపూర్ సమీపంలో ఢీకొన్నాయి. ప్రమాదంలో త్రివేణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. శివ, రఘు, రామా నాయుడులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108కు సమాచారం అందించి, క్షతగాత్రులను అంబులెన్సులో కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రామానాయుడు హైదరాబాద్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. ఈనెల 14న ఆయన వివాహం జరగాల్సి ఉన్నది. ఈ సందర్భంగా ఆయన పెళ్లి పత్రికలు పంచి వస్తుండగా ప్రమాదం జరిగింది. ఈ విషయంపై ఎస్‌ఐ శ్రీనివాసరావును సంప్రదించగా కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.



కలెక్టర్‌కు సమస్యలను వివరిస్తున్న బ్రీడింగ్ చెక్కర్లు (ఫైల్)



ఆత్మకూర్ మండలంలో దోమల నివారణ మందును పిచికారి చేస్తున్న బ్రీడింగ్ చెక్కర్లు (ఫైల్)

బ్రీడింగ్ చెక్కర్లకు అందని వేతనాలు

▸▸ ప్రతీ ఏడాది ఐదు నెలలు మాత్రమే పని

▸▸ గత ఏడాది చేసిన పనికి అందని డబ్బు

వనపర్తి వైద్యవిభాగం, మే 7 (ఆంధ్రజ్యోతి) : వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో పనిచేసే బ్రీడింగ్ చెక్కర్లకు గత ఏడాది చేసిన పనికి ఇప్పటివరకు వేతనాలు అందలేదు. దీంతో వారు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రజారోగ్య పరిరక్షణ కోసం వైద్య ఆరోగ్య శాఖ అనేక కార్యక్రమాలను చేపడ్తుంది. అందులో ఏఎల్‌వో (యాంటీ లార్వా ఆపరేషన్) బృందం ఒకటి. ఈ బృందంలో పని చేసేందుకు వనపర్తి జిల్లా వ్యాప్తంగా 15 మంది బ్రీడింగ్ చెక్కర్లను తాత్కాలిక పద్ధతిలో నియమించారు. వారు గత ఏడాది జూలై నెల నుంచి నవంబరు వరకు ఐదు నెలల పాటు విధులు నిర్వర్తించారు. కానీ వారికి ఇప్పటివరకు వేతనాలు అందలేదు. రావలసిన డబ్బు కోసం అప్పటి నుంచి వారు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు.

ఏడాదికి ఐదు నెలలే పని

యాంటీ లార్వా ఆపరేషన్ కోసం నియమించిన బ్రీడింగ్ చెక్కర్లకు దోమలు వ్యాపించే కాలంలోనే పని కల్పిస్తున్నారు. అందుకోసం ప్రతీ ఒక్కరికి నెలకు రూ. 10 వేల చొప్పున వేతనం చెల్లిస్తారు. యాంటీ లార్వా ఆపరేషన్ ద్వారా దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను కట్టడి చేసేందుకు అవసరమైన చర్యలను వీరు తీసుకుంటారు. దోమలను లార్వా దశలోనే గుర్తించి అరికడతారు. అందు కోసం వర్షాకాలంలో ఇంటింటికి తిరిగి ప్రజలకు అవగాహన కల్పిస్తారు. డెంగ్యూ వ్యాధి సోకిన వారి ఇంటిని పరిశీలించడంతో పాటు, చుట్టుపక్కల ఇళ్లలో కూడా దోమల నివారణ మందును స్ప్రే చేస్తారు. ఇలా ప్రజారోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్న బ్రీడింగ్ చెక్కర్లకు ఏడాదిలో ఐదు నెలలు మాత్రమే పని ఉంటోంది. మిగతా ఏడు నెలల్లో వారికి ఉపాధి ఉండదు.

బడ్జెట్ లేక వేతనాలు పెండింగ్

బ్రీడింగ్ చెక్కర్లకు ఐదు నెలల వేతనాలు చెల్లించాల్సి ఉంది. ప్రతీ నెల రూ. 10 వేల చొప్పున 15 మందికి రూ. 7.5 లక్షలు అవసరం అవుతాయి. కానీ పని దినాలు ముగిసి ఆరు నెలలు గడిచినా వారికి చెల్లించాల్సిన వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో వారు రావలసిన వేతనాల కోసం వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. అయినా ఫలితం లేకపోవడంతో తాజాగా ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెండింగ్ వేతనాలను చెల్లించాలని వారు కోరుతున్నారు.

మరో పది రోజుల్లో చెల్లిస్తాం



గతంలో బ్రీడింగ్ చెక్క ర్లకు మేమే వేతనాలు చెల్లించేవాళ్లం. ప్రస్తుతం రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ కమిషనర్ నుంచే విడుదల చేయనున్నట్లు ఆదేశాలు ఇచ్చారు. అందుకోసం జిల్లాలో పని చేసే 15 మంది బ్రీడింగ్ చెక్కర్ల ఖాతా నెంబర్లు, ఇతర వివరాలను కమిషనర్ కార్యాలయానికి పంపించాం. కార్మికులకు మరో పది రోజుల్లో వేతనాలు చెల్లించేందుకు కృషి చేసున్నాం. ఇది రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సమస్య.

- డాక్టర్ అల్లే శ్రీనివాసులు, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి, వనపర్తి

సృజనాత్మకత పెంపొందించేందుకే సమ్మర్ క్యాంపులు

వనపర్తి విద్యావిభాగం, మే 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించడం కోసం ప్రభుత్వ పాఠశాలల్లో యంగ్ ఇండియా సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా పరీక్షల విభాగం సెక్రటరీ జీహెచ్‌ఎం సూర చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం వనపర్తి పట్టణంలోని దళితవాడ జడ్పీహై స్కూల్‌లో జరుగుతున్న సమ్మర్ క్యాంపును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వేసవి సెలవుల్లో పిల్లలు ఖాళీగా ఉండకుండా ఉదయం సమయంలో స్పోకెన్ ఇంగ్లీష్, గణిత శాస్త్రంలో మెలకువలు, చిత్రలేఖనం, బొమ్మల తయారీ ఇండోర్ గేమ్స్ మున్నగు వాటిలో 15 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 40 మందిదాకా విద్యార్థులు హాజరవుతున్నారని, మరింత మంది హాజరయ్యేలా చూస్తామని చంద్రశేఖర్ తెలిపారు.

వనపర్తి ఎంఈవో మద్దిలేటి, సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్, ఉపాధ్యాయులు రవికుమార్, మధుసూదన్ రెడ్డి, బైరోజు చంద్రశేఖర్, విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న విజయమ్మ, కల్పన తదితరులు పాల్గొన్నారు.

చిరుత దాడితో మేకల మృతి

గండీడ్, మే 7 (ఆంధ్రజ్యోతి) : చిరుత దాడితో మూడు మేకలు మృతి చెందాయి. మహబూబ్‌నగర్ జిల్లా, గండీడు మండల పరిధిలోని పగిడ్యాల గ్రామ శివారులోని చింత గుట్టలో ఈ సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన రైతు కావలి వెంకటయ్య బుధవారం తెల్లవారుజామున తమ పొలంలో మేక పిల్లలకు పాలు పట్టించి ఇంటికి వెళ్లాడు. మళ్లీ 10 గంటల సమయంలో పొలానికి వెళ్లగా అప్పటికే మూడు మేక పిల్లలు చనిపోయి ఉన్నాయి. చిరుత దాడి చేసి వాటిని చంపేసిందని బాధితుడు తెలిపారు.

రైతులు ఎరువుల వాడకాన్ని తగ్గించండి

▸▸ వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త డాక్టర్ సిద్ధప్ప



రైతుల సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త డాక్టర్ సిద్ధప్ప

వనపర్తి రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక రైతు ఎరువుల వాడకాన్ని తగ్గించాలని వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త సిద్ధప్ప అన్నారు. బుధవారం వనపర్తి మండలం చిట్యాల గ్రామంలోని రైతు వేదికలో రైతులకు వ్యవసాయ శాస్త్ర వేత్తలు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి రైతు వ్యవసాయ పొలంలో యూరియాతో పాటు ఎరువులను తగ్గించి పొలాన్ని దెబ్బతినకుండా చూడాలని అన్నారు. వానాకాలం పంట, యాసంగి పంటల అనంతరం వ్యర్థాలను లేదా కొయ్యలను కాల్చరాదని భూమిలో కలియదున్నాలని అన్నారు. ఆయిల్‌పామ్ పంటను అధిక మొత్తంలో సాగు చేసేందుకు రైతులు మొగ్గు చూపాలని అన్నారు. మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వ్యవసాయ అధికారి కురుమయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శాంతన్న, ప్రియునిక్ ఆయిల్‌పామ్ కంపెనీ ప్రతినిధులు, అచ్యుతాపురం, రాజనగరం గ్రామాల రైతులు వ్యవసాయ కళాశాల పాలెం సిబ్బంది విలాకర్, దివ్య పాల్గొన్నారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

▸▸ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి స్వాములు



జిల్లా స్థాయి అథ్లెటిక్స్ కిడ్స్ పోటీల్లో విజేతలైన చిన్నారులతో నాయకులు

కల్వకుర్తి, మే 7 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ సోలపోగుల స్వాములు అన్నారు. వరల్డ్ అథ్లెటిక్స్ డేను పురస్కరించుకుని కల్వకుర్తి మండలం మార్చాల గ్రామంలో జిల్లా స్థాయి కిడ్స్ అథ్లెటిక్స్ పోటీలను బుధవారం నిర్వహించారు. పోటీలను కల్వకుర్తి జైలు సూపరింటెండెంట్ చంద్రశేఖర్ ప్రారంభించారు. పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి దాదాపుగా 250మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారని కార్యదర్శి స్వాములు తెలిపారు. అనంతరం జిల్లాస్థాయి కిడ్స్ పోటీలల్లో ఎంపికైన క్రీడాకారులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా సంయుక్త కార్యదర్శి అంజయ్య, కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాదయ్యగౌడ్, భీమయ్య, ప్రసాద్, పాండు పాల్గొన్నారు.

సంగమేశ్వర ఆలయం వద్ద భక్తులకు నీడ వసతి

కొల్లాపూర్, మే 7 (ఆంధ్రజ్యోతి) : తెలుగు రాష్ట్రాల ప్రజలు ఆరాధ్య దైవంగా పూజించే సప్త నదుల సంగమ క్షేత్రం సంగమేశ్వరం ఆలయం వద్ద బుధవారం భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. తెలుగు రాష్ట్రాల నుంచి మే నెలలో 45 డిగ్రీల ఎండలో భక్తులు సంగమేశ్వర ఆలయాన్ని దర్శించుకుని ఇబ్బందులు పడకుండా ఆలయ పరిసరాల్లోనే సేద తీరుటకు నంద్యాల జిల్లా కలెక్టర్ సహకారంతో చలువ పందిళ్లు ఏర్పాటు చేసినట్లు ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామయ్య శర్మ వెల్లడించారు. జూలై 10వ తేదీ వరకు పందిళ్లు ఉంటాయన్నారు. జూలై 7వ తేదీన తొలి ఏకాదశి ఆదివారం అయినందున 9వ తేదీ సోమవారం వరకు చలువ పందిళ్లు ఉంచడం జరుగుతుందని పురోహితులు తెలకపల్లి రఘురామయ్య శర్మ వెల్లడించారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు రాలేదు

▸▸ అధికారులతో గ్రామస్థుల వాగ్వాదం, దాడికి యత్నం

▸▸ పోలీసులకు పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు

గట్టు, మే 7 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్లను అనర్హులకు ఇచ్చారంటూ గ్రామస్థులు అధికారులతో వాగ్వాదానికి దిగి, దాడికి యత్నించారు. దీంతో అధికారులు విచారణ చేపట్టకుండా వెనుదిరిగారు. జోగుళాంబ గద్వాల జిల్లా, గట్టు మండల పరిధిలోని తప్పట్ల మొర్సులో బుధవారం ఈ సంఘటన జరిగింది. గ్రామానికి 18 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. లబ్ధిదారుల జాబితాపై విచారణ నిర్వహించేందుకు ఎంపీఓ రవికుమార్, పంచాయతీ కార్యదర్శి తిమ్మప్ప గ్రామానికి వెళ్లారు. ఈ సందర్భంగా కొందరు గ్రామస్థులు వారితో వాగ్వాదానికి దిగారు. అనర్హులను ఎంపిక చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ దుర్భాషలాడారు. తమకు పైఅధికారుల నుంచి జాబితా వచ్చిందని, వివరాలు సేకరించేందుకు వచ్చామని చెప్పినా గ్రామస్థులు వారిని విచారణకు వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారు. ఒక దశలో కొందరు పంచాయతీ కార్యదర్శిపై దాడికి యత్నించినట్లు సమాచారం. ఎంత నెచ్చచెప్పినా వినకపోవడంతో విచారణ చేయకుండానే అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి తిమ్మప్ప తెలిపారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత



పోలీస్‌స్టేషన్ ముందున్న ఇసుక టిప్పర్లు

కృష్ణ, మే 7 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, కృష్ణ మండలంలో ని ముడుమాల్ శివారులోని కృష్ణానది నుంచి ఇసుకను అక్రమంగా తరలి స్తున్న రెండు టిప్పర్లను రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. మండలంలో నికున్సి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద మంగళవారం అర్ధరాత్రి ఇసుకలోడ్‌తో కర్ణాటక వైపు వెళ్తున్న రెండు టిప్పర్లను తహసీ ల్దార్ బి.వెంకటేశ్ ఆపి తనిఖీ చేశారు. ఇసుక కనిపించకుండా టిప్పర్లపై గ్రీన్‌నెట్ వేసి ఉన్నట్లు గుర్తించారు. వాహనాలను స్టేషన్‌కు తరలించారు. కానీ 'ఆంధ్రజ్యోతి' బుధవారం మధ్యాహ్నం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా టిప్పర్లు కనిపించలేదు. ఈ విషయంపై ఎస్‌ఐ నవీద్‌ను వివరణ కోరగా తహ సీల్దార్‌ను సంప్రదించాలని సూచించారు. ఆయనకు ఫోన్ చేయగా స్పం దించలేదు.

వీపనగండ్ల మండలంలో 4 ట్రాక్టర్లు...

వీపనగండ్ల (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, వీపనగండ్ల మండలంలోని తూముకుంట వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఏఎస్‌ఐ చంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం రాత్రి తూముకుంట, సంపత్రావుపల్లికి చెందిన నాలుగు ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో కల్వరాల సమీపంలో దాడి చేసి పట్టుకున్నట్లు చెప్పారు. వారి వద్ద అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రా క్టర్లను స్టేషన్‌కు తరలించామన్నారు. బుధవారం కేసు నమోదు చేసి, ద ర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దామరగిద్ద మండలంలో మరో ట్రాక్టర్



అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్న పోలీసులు

దామరగిద్ద ,మే 7 (ఆంధ్రజ్యోతి) : అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకు న్నట్లు ట్రైనీ ఎస్‌ఐ మ హేశ్వరి తెలిపారు. నారాయణపేట జిల్లా, మండలంలోని పేరపళ్ల తండాకు చెందిన దశరథ్ నాయక్ అనుమతి లేకుండా ట్రాక్టర్‌లో ఇసు కను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి, ట్రాక్టర్ యజమాని బుజ్జిబాయి, డ్రైవర్ దశరథ్ నాయక్‌లపై కేసు నమోదు చేసినట్లు ట్రైనీ ఎస్‌ఐ తెలిపారు.

తల్లీకూతుళ్లపై దాడి

▸▸ నలుగురిపై కేసు నమోదు

వెల్దండ, మే 7 (ఆంధ్రజ్యోతి) : తల్లీకూతుర్లపై కొందరు అడ్డగిం చి దుర్భాషలాడుతూ దాడికి యత్నించారు. వెల్దండ ఎస్‌ఐ కురుమూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, వెల్దండ మండల పరిధిలోని మర్రిగూడ తండాకు చెందిన బుజ్జి, ఆమె కుమార్తె నందిని ఈనెల 5న మండలంలోని కొత్రతాండాలో జరిగిన బంధువుల పెళ్లికి వెళ్లారు. అనంతరం గ్రామానికి తిరిగి వస్తుండగా చీన్యాతండాకు చెందిన గోపి, అఖిల్, మర్రిగుంత తండాకు చెందిన రాత్లావత్ శ్రీను, నవీన్లు వారిని అడ్డగించారు. అసభ్యంగా దూషిస్తూ దాడి చేశారు. ఈ మేరకు బాధితురాలు బుజ్జి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

ఊర్కొండ, మే 7 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తిని కులం పేరుతో దూ షించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఊ ర్కొండ ఎస్‌ఐ కృష్ణదేవ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా, ఊర్కొండ మండలంలోని గుడిగాని పల్లి గ్రామానికి చెందిన పల్లెమోని ఆనం ద్, పల్లెమోని అర్జునయ్యలు మంగళవారం అదే గ్రామానికి చెందిన పిల్లెల్ల కృష్ణకుమార్‌ను కులం పేరుతో దూషిస్తూ, దాడి చేసి గాయపరిచారు. ఈ మేరకు బాధితుడు బుధవారం పోలీసులకు ఫిర్యా దు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇంటర్వ్యూ..

మెరుగైన విద్యుత్ సరఫరాకు కృషి

- మేఘనాథ్, ఏఈ, ట్రాన్స్‌కో



వంగూరు, మే 7 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో ఎలాంటి కోతలు లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని ట్రాన్స్‌కో ఏఈ మేఘనాథ్ అన్నారు. వ్యవసాయం, గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని, వేసవిలో విద్యుత్ సరఫరాకు ఇబ్బందులేకుండా తగు చర్యలు తీసుకున్నట్లు ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పేర్కొన్నారు.

లో వోల్టేజీ రాకుండా ఏమి చర్యలు తీసుకుంటున్నారు ?

మండలంలో 7,458 విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. వేసవి కార్యాచరణ ప్రణాళికలో భాగంగా గ్రామాల్లో ప్రస్తుతం ఉన్న వాటికి అదనంగా ఇటీవల 22 ట్రాన్స్‌ఫార్మర్లను బిగించాం. లోవోల్టేజీ సమస్య రాకుండా సిబ్బందిని అప్రమత్తం చేశాం.

మండలంలో ఎన్ని విద్యుత్ ఉప కేంద్రాలున్నాయి ?

మండలంలో మొత్తం 6 విద్యుత్తు ఉప కేంద్రాలున్నాయి. కొత్తగా గాజర, ఉల్పర గ్రామాలకు మంజూరయ్యాయి.

త్రీ ఫేజ్ సప్లై సక్రమంగా వస్తుందా ?

త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా సక్రమంగా సరఫరా చేస్తున్నాం, ఏదైనా సాంకేతిక సమస్య వచ్చినప్పుడు త్రీ ఫేజ్ సప్లైలో అంతరాయం కల్గుతుంది.

గృహజ్యోతి కింద ఎంత మందికి ఇస్తున్నారు ? కొత్తగా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందా ?

గృహజ్యోతి కింద ప్రతీ నెల 4,450 కనెక్షన్లకు ఉచిత విద్యుత్తు సరఫరా చేస్తున్నాం. 1,628 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. కొత్త వారికి ఈ పథకం అమలుకు ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాలేదు. ప్రభుత్వం ప్రకటిస్తేనే కొత్త వారికి అవకాశం ఉంటుంది.

న్యూస్ బాక్స్

ప్రతీ రైతుకు గుర్తింపు కార్డు

చారకొండ, మే 7 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు గుర్తింపు కార్డు కోసం మొబైల్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ నమోదు కార్యక్రమాన్ని మండల వ్యవసాయశాఖ అధికారి తనూజరాజ్ ఆధ్వర్యంలో మండలంలోని చంద్రాయన్‌పల్లి గ్రామపంచాయతీ భవణంలో ఏఈవో మహేశ్వరి చేపట్టారు. ఈసందర్భంగా ఏవో తనూజ రాజ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రైతు రిజిస్ట్రేషన్ కోసం రైతులు తమకు సంబంధించిన ఆధార్‌కార్డు, పట్టా పాసు పుస్తకం, ఆధార్‌కార్డు లింక్ ఉన్న మొబైల్‌ను సంబంధిత ఏఈవోల వద్దకు తీసుకొస్తే రిజిస్ట్రేషన్ చేస్తారని, దీంతో ప్రతి రైతుకు ఐడీ నెంబర్ కలిగిన కార్డు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న భూ భారతి కార్యక్రమం

పెంట్లవెల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారం దిశగా పెంట్లవెల్లి మండలాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. దీనిలో భాగంగా బుధవారం జటప్రోలులో 128 దరఖాస్తులు వచ్చాయి. అదే విధంగా మంచాలకట్ట గ్రామంలో 111 దరఖాస్తులు వచ్చాయని ఆర్డీవో బన్సీలాల్ పేర్కొన్నారు. గురువారం పెంట్లవెల్లి, కొండూరు గ్రామాల్లో భూభారతి కార్యక్రమం నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు. భూభారతి ద్వారా భూ సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సర్వే యర్ పాండు, జూనియర్ అసిస్టెంట్ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురికి జైలు శిక్ష, జరిమానా

నాగర్‌కర్నూల్ క్రైం, మే 7 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన ముగ్గురు వ్యక్తులకు జైలు శిక్షతో పాటు వంద రూపాయల చొప్పున జరిమానాను జిల్లా ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జడ కావ్య విధించారని నాగర్ కర్నూల్ ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. నాగర్‌కర్నూల్ పరిసర ప్రాంతంలో డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహిస్తుండగా నాగర్‌కర్నూల్‌కు చెందిన కృష్ణయ్య మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడి కోర్టులో ప్రవేశపెట్టడంతో మూడు రోజుల జైలు శిక్షతో పాటు వంద రూపాయల జరిమానాను జిల్లా ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కావ్య విధించారు. తూడుకుర్తికి చెందిన శేఖర్ మద్యం తాగివాహనం నడపడంతో అతనికి మూడు రోజుల జైలు శిక్షతోపాటు వంద రూపాయల జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు. మండలం తుమ్మలసూగురకు చెందిన వెంకటేశ్ మద్యం మత్తులో వాహనం నడపడంతో పోలీసులకు పట్టుబడడంతో కోర్టులో ప్రవేశపెట్టారు. ఈ సంఘటనపై అతనికి రెండు రోజుల జైలు శిక్షతోపాటు వంద రూపాతయల జరిమానాలను జిల్లా ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కావ్య విధించారు.

వివాహానికి ఆర్థిక సాయం

తిమ్మాజిపేట, మే 7 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చేగుంట గ్రామంలో చిన్నబుచ్చన్న కూతురు గోసుల గాయత్రి వివాహానికి ఎంఎస్‌ఆర్ ట్రస్ట్ ద్వారా రూ. 10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ట్రస్ట్ చైర్మన్ మారేపల్లి సురేందర్‌రెడ్డి సమకూర్చిన నగదును సభ్యులు బుధవారం అందజేశారు. ట్రస్ట్ ద్వారామరిన్ని సేవలు చేయనున్నట్లు తెలిపారు. ట్రస్ట్ సభ్యులు గాలి చెన్నయ్య, శ్రీశైలం, బాలకృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, స్వామి, మల్లేష్ ఉన్నారు.

అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఎంపిక చేస్తే

కఠిన చర్యలు

- కలెక్టర్ బదావత్ సంతోష్



ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

కల్వకుర్తి, మే 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వేసవి కాలంలో తాగునీరు ఇబ్బందులు రాకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని రఘుపతిపేటలో ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని లింగసానిపల్లిలో మంచినీటి సరఫరాపై మిషన్‌భగీరథ పంపుహౌజ్‌ను క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. ముందుగా ఇందిరమ్మ గృహ లబ్ధిదారులతో స్వయంగా కలెక్టర్ మాట్లాడారు. నిరుపేదలకు మాత్రమే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసేలా పటిష్ట ప్రణాళిక ద్వారా ముందుకు పోతున్నామన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం ఉచితంగా ఇసుకను అందజేస్తుందని సిమెంటు ధర మార్కెట్ కనుగుణంగా అందించాలని, ఎవరైనా అధిక ధరలకు అమ్మినా, ఇంటిని నిర్మించే మేస్త్రీలు అధికంగా డబ్బులు అడిగినా స్థానిక అధికా రులతో మాట్లాడాలని సూచించారు. మిషన్‌భగీరథ ద్వారానే ఇంటింటికి తాగునీరు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రఘుపతిపేట గ్రామంలో ప్రాథ మిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిం చారు. ధాన్యాన్ని. రిజిస్టర్లను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. త్వరితగతిన కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని లారీల కొరత లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట కల్వకుర్తి ఆర్డీవో శ్రీనివాస్, ఎంపీడీవో వెంకటరాములు, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు

- వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలు

కొల్లాపూర్, మే 7 (ఆంధ్రజ్యోతి) : వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మ వారి జయంతి వేడుకలను కొల్లాపూర్ పట్టణంలో కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులు ఘనంగా నిర్వహించారు. జయంతి సందర్భంగా అమ్మ వారిని ఘనంగా అలంకరిం చి, పండితులు వేద మంత్రోచ్ఛరణాల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● అమ్రాబాద్ : అమ్రాబాద్‌లోని ఆర్యవైశ్య సంఘం మండల కమిటీ కార్యాలయంలో బుధవారం వాసవీ మాత జయంతిని పురస్క రించుకొని అమ్మవారి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకుమార్చన, అభిషేకం, డోలారోహణం, ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అమ్రాబాద్ ఉమ్మడి మండల కమిటీ అధ్యక్షుడు నీల శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, ఆర్యవైశ్య సంఘం జిల్లా నేతలు సంబు వెంకటరమణ, జూలూరి సత్యనారాయణ, భాగ్యలక్ష్మి, పోలా శ్రీనివాసులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.



వాసవీ మాత విగ్రహానికి పూజలు చేస్తున్న మహిళలు

● కల్వకుర్తి : కల్వకుర్తి పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఆలయ ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్ జూలూరు రమేష్‌బాబు ఆధ్వర్యంలో వాసవీ మాత జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వాసవీమాత అమ్మవారి పల్లకి సేవలో మహిళా భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య పట్టణ మండల సంఘం నాయకులు అనుబంధ సంఘాల నాయకులు, వాసవీక్లబ్, ఆవోపా, మహిళా సంఘం నాయకులు, నాయకురాళ్లు పాల్గొన్నారు.



కొల్లాపూర్‌లో ఘనంగా అలంకరించిన వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మ వారు

● చారకొండ : మండల కేంద్రంలోని లక్ష్మీ పద్మావతి వేంకటేశ్వర స్వామి ఆలయంలో వాసవీమాత జయంతి వేడుకలను ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో బుధవారం మహిళలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వాసవీ మాతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో అనిత, విజయలక్ష్మి, వరలక్ష్మి, సంతు, నర్మద, నిర్మల, గీతా, వైష్ణవి, వనజ, దివ్య, శ్వేత, సంధ్య, పావని, జ్యోతి, మల్లేశ్వరి, శివలీల, శోభ పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం అభ్యర్థులకు ఇంటర్వ్యూలు

చారకొండ, మే 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం కోసం దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులకు బుధవారం అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో ఎంపీడీవో ఇసాక్ హుసేన్ ఆధ్వర్యంలో అభ్యర్థుల పత్రాలను పరిశీలించారు. పరిశీలనలో మండలంలోని చారకొండ యూనియన్ బ్యాంకు, జూపల్లి టీజీబీ బ్యాంకు మేనేజర్లు నర్సింహ, శివప్రసాద్ పాల్గొన్నారు. ఎస్సీ అభ్యర్థులు 104 మంది దరఖాస్తు చేసుకోగా 37మంది హాజరయ్యారు. మైనార్టీ అభ్యర్థులు 61 మంది దరఖాస్తు చేసుకోగా 34మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఎంపీడీవో తెలిపారు. ఏపీఎం రాములుపాల్గొన్నారు.

108 మంది హాజరు

అమ్రాబాద్ : నిరుద్యోగ మైనార్టీ యువకులకు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు 108 మంది హాజరయ్యారు. అమ్రాబాద్ ఎస్‌బీఐ పరిధిలో 71, మన్ననూర్ బ్రాంచ్ పరిధిలో 30, పెంట బ్రాంచి పరిధిలో 7, మంది హాజరయ్యారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి డాక్టర్ రజిని, ఎంపీడీవో జగదీశ్వర్, ఆయా బ్రాంచ్ మేనేజర్లు, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో..

ఉప్పునుంతల : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎంపీడీవో మోహన్‌లాల్ ఆధ్వర్యంలో బుధవారం రాజీవ్ యువ వికాసం దరఖాస్తుదారులకు వెల్టూరు, ఉప్పునుంతల తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్లు, ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీవో నారాయణ ఉన్నారు.

నేటి నుంచి ఇంటర్వ్యూలు

కొల్లాపూర్ :రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారుల ఎంపికకై వివిధ బ్యాంకులు ఈనెల 8వ తేదీ నుంచి 15వ తేదీ వరకు కేటగిరీల వారీగా కొల్లాపూర్ పట్టణంలోని నూతన గ్రంథాలయం భవనంలో దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూ నిర్వహిం చనున్నట్లు కొల్లాపూర్ మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తుదారులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని పేర్కొన్నారు.



అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

13న ఇంటర్వ్యూలు

నాగర్‌కర్నూల్ టౌన్ : ఈ నెల 13న మంగళవారం రాజీవ్ యువ వికాసం పథకం కోసం దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగ యువతీ, యువకులకు మునిసిపల్ కార్యాలయంలో ఇంట ర్వ్యూలు నిర్వహించనున్నట్లు నాగర్‌కర్నూల్ మునిసిపల్ కమిషనర్ నరేష్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు వారి ఆధార్‌కార్డు, ఆదాయం, కులం, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో పాటు బ్యాంక్ బాస్‌బుక్, మీసేవలో దరఖాస్తు చేసుకున్న రశీదుతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని ఆయన సూచించారు.

అందాల పోటీలను రద్దు చేయాలి

- ఐద్వా జిల్లా కార్యదర్శి కె. గీత



నిరసన వ్యక్తం చేస్తున్న ఐద్వా, డీవైఎఫ్‌ఐ నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే అందాల పోటీలను రద్దు చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కె.గీత డిమాండ్ చేశారు. బుధవారం ఐద్వా ఆధ్వర్యంలో జిల్లా కేం ద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గీత మాట్లాడుతూ మిస్‌వరల్డ్ పోటీలకు ఖర్చు పెట్టే రూ.200 కోట్లు అమ్మాయిల రక్షణకు, ఉపాధి కల్పనకు, విద్యార్థుల చదువుకు ఖర్చు పెట్టొచ్చన్నారు. అందాల పోటీలను వెంటనే రద్దు చేయాలని, లేని పక్షంలో మహిళల అగ్రహానికి గురికాక తప్పదని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాలు శోభ, లక్ష్మి, వెంకటమ్మ, లక్ష్మమ్మ, అలివేల, డీవైఎఫ్‌ఐ నాయకులు శివరాం, మల్లికార్జున్, సుభాష్, కుర్మయ్య, సుల్తాన్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల వద్ద అధికారుల పర్యవేక్షణ కరువు

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు



జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అధికారుల పర్యవేక్షణ కరువైందని, దీంతో ఇష్టానుసారంగా తూకం వేస్తూ రైతులను మోసం చేస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సీపీఎం బృందం పరిశీలించారు. వర్ధం పర్వతాలు మాట్లాడుతూ మార్కెట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద బ్యాగు తూకం తప్పా అదనంగా కాంటాలు చేయొద్దని డిమాండ్ చేశారు. దీనికి ఆసరాగా చేసుకుని ప్రైవేటు వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు గీత, రామయ్య, అశోక్, మధు, సుభాష్, శివరాం తదితరులు పాల్గొన్నారు.

కేంద్రాలను తక్షణమే ప్రారంభించాలి

తాడూరు : మండల పరిధిలోని గ్రామాల్లో సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం వడ్లను పరిశీలించారు. తక్షణమే రైతుల దగ్గర నుండి వడ్లను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి అంతటి కాశన్న మాట్లాడుతూ రైతులు పండించిన పంట మార్కెట్‌లో తెచ్చి పోసి రోజులు అవుతున్న నేటికీ ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడం వల్ల గాలికి, వర్షానికి తడుస్తున్నదని అన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చెన్న శ్యాం సుందర్, ఏన్నుపోతుల కాశన్న, ఏన్నుపోతుల వెంకటస్వామి, చేన్న బాలరాజు, రాములు, చంద్రయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భారత ఆర్మీకి శతకోటి వందనాలు

పెద్దకొత్తపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సిందూర్ పేరిట పాకిస్తాన్ ఉగ్రవాద స్థావరాలపై ఉక్కుపాదం మోపిన భారత ఆర్మీకి శతకోటి వందనాలు అని బీసీ జన చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం ప్రకటనను విడుదల చేశారు. పహల్గామ్‌లో అమాయక ప్రజల ప్రాణాలను బలి తీసుకున్న పాకిస్తాన్ ఉగ్రవాదుల స్థావరాలపై రెట్టింపు దీటుగా సమాధానం ఇచ్చిన భారత ఆర్మీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దేశంలో ఉగ్రవాదం ఎక్కడున్నా కూకటి వేళ్లతో పెకిలించి వేయాలని ఆయన కోరారు.

క్రీడలతో స్నేహసంబంధాల పెంపు

- మాజీ వైస్‌ఎంపీపీ అనిల్‌కుమార్

వెల్దండ, మే 7 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో స్నేహసంబంధాలు పెరుగుతాయని మాజీ వైస్‌ఎంపీపీ అనిల్‌కుమార్ (ఐజాక్) అన్నారు. రాచూరు గ్రామంలో నిర్వహిస్తున్న ఆర్పీఎల్ క్రికెట్ పోటీలను బుధవారం అనిల్‌కుమార్ పరిశీలించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే పోటీల్లో మెరుగైన క్రీడాకారులు వెలుగులోకి వస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు పర్వతాలు, నిర్వాహకులు, క్రీడాకారులు నాగేష్, రాజు, పూరన్‌చంద్, శ్రీనివాస్, నిరంజన్, క్రాంతి, రమేష్, రామార్జున్, వెంకటేష్, ప్రహ్లాద్ తదితరులు ఉన్నారు.

నిబంధనల ప్రకారం వాహనాలు నడపాలి

వంగూరు, మే 7 (ఆంధ్రజ్యోతి) : నిబంధనల ప్రకారం వాహనాలు నడపాలని ఎస్‌ఐ మహేందర్ సూచించారు. మండలంలో ఉల్పర, పోతారెడ్డిపల్లి దుందుబీ వాగు నది పరివాహక ప్రాంతంలో నడుస్తున్న ఇసుక ట్రాక్టర్లను బుధవారం ఆయన పరిశీలించారు, డ్రైవర్లకు తగు సూచనలు చేశారు. అనుమతి ఉన్నవారు మాత్రమే ఇసుకను తరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ ట్రాక్టర్‌ను సంబంధించిన పేపర్లు, మైనర్ వాహనం నడిపితే చర్యలు తప్పవని, యజమానులపై కేసులు నమోదు చేస్తామని సూచించారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం



పెంట్లవెల్లి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

పెంట్లవెల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆరాధన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 7గంటలకు అభిషేకం, 9గంటలకు మూలవిరాట్ అభిషేకం, 10.30 నిమిషాలకు గణపతి పూజ, వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవింద మాంబ, గాయత్రి మాత, ఈశ్వరిమాత, సిద్ధయ్యస్వామి విగ్రహాలకు పుష్పార్చన, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. 10.30 గంటలకు పూర్ణాహుతి, 11.30 నిమిషాలకు శ్రీ గోవిందమాంబ, వీరబ్రహ్మేంద్ర స్వాముల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సుదర్శన్ చారి, స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు శ్రీను, మాజీ ఎంపీటీసీ సుమలత, సంఘం నాయకుడు శేషు పాల్గొన్నారు.

● వెల్దండ : మండల కేంద్రంలోని బ్రహ్మగిరి దేవాలయంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. భక్తులు పెద్దఎత్తున ఆరాధనోత్సవాలకు హాజరయ్యారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణసంఘం మండల అధ్యక్షుడు కృష్ణయ్య, నిర్వాహకులు రాజయ్య, జంగాచారి, పాండుచారి, రామాచారి, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటయ్యగౌడ్, బీజేపీ నియోజవర్గ ఇన్‌చార్జి యెన్నం శేఖర్‌రెడ్డి, నాయకులు భూపతిరెడ్డి, ఆర్యవైశ్యసంఘం జిల్లా అధ్యక్షుడు బచ్చురామకృష్ణ తదితరులు ఉన్నారు.

● పెద్దకొత్తపల్లి : స్థానిక విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. స్థానిక మాజీ సర్పంచ్‌లు ఆదెర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, సత్యం, మండల కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీటీసీ సభ్యుడు దండు నరసింహ, సింగిల్‌విండో డైరెక్టర్ దండు చంద్రయ్య, మత్స్య సహకార సంఘం మండల అధ్యక్షుడు డబ్బా ఎల్లయ్య, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు రాయిపాకుల బ్రహ్మం చారి, మహేష్‌చారి, లక్ష్మీనరసింహచారి, కరుణాకర్‌చారి, బీఆర్ఎస్ నాయకులు మాజీ జడ్పీటీసీ సింగారం వెంకటయ్యయాదవ్, మండల రైతు సమన్వయ కమిటీ మాజీ అధ్యక్షుడు పి.నాగరాజులు పూజించారు.

సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామంలో పూజలు



ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న నాయకులు

వంగూరు, మే7 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, గీత దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం వారి స్వగ్రామమైన మండలంలోని కొండారెడ్డిపల్లిలో ఆంజనేయస్వామి ఆలయంలో నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ వేమారెడ్డి, హిందుకుమార్, రాములు యాదవ్, వెంకటయ్య బాబు వంశీ, సంతోష్‌రెడ్డి, జంగయ్య, వెంకటేష్, తిరుపతి పాల్గొన్నారు.

కోర్టు భవనానికి రూ.100 కోట్లు మంజూరు చేయాలి

- కల్వకుర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి

కల్వకుర్తి, మే 7 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలో కోర్టు భవనం శిథిలావస్థకు చేరిందని కోర్టుకు నూతన భవన సముదాయాలకు రూ.100కోట్ల నిధులను సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి మంజూరు చేయాలని కల్వకుర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నరేందర్ రెడ్డి కోరారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1938లో కోర్టు భవనాన్ని నిర్మించారని తెలిపారు. ప్రస్తుతం భవనం శిథిలావస్థకు చేరి పెచ్చులూడి పడుతోందని పేర్కొన్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి రూ.15లక్షలు మంజూరు చేయడంతో భవనం పైనరేకులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కల్వకుర్తిలో మూడు కోర్టులు నడుస్తున్నాయని పేర్కొన్నారు. నిధుల విడుదలకు సీఎం రేవంత్ రెడ్డి సహకరించాలని కోరారు. విలేకర్ల సమావేశంలో సీనియర్ న్యాయవాదులు బ్యాంగి అమరేందర్, వెంకట్‌రెడ్డి, న్యాయవాదులు లక్ష్మీనారాయణ, రాంగోపాల్, ఎముక జంగయ్య, నాగరాజు, వెంకటరమణ, ప్రశాంత్, శ్రీకాంత్, సుభాష్, నరేష్, లక్ష్మణ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

- సింగిల్‌విండో చైర్మన్ పెబ్బేటి కృష్ణయ్య



కొల్లాపూర్ మార్కెట్ యార్డులో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సింగిల్‌విండో చైర్మన్ పెబ్బేటి కృష్ణయ్య

కొల్లాపూర్, మే 7 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన వరి పంటను దళారులకు విక్రయించి మోసపోవద్దని సింగిల్‌విండో చైర్మన్ పెబ్బేటి కృష్ణయ్య రైతులకు సూచించారు. బుధవారం కొల్లాపూర్ మార్కెట్ యార్డులో సింగిల్‌విండో ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సింగిల్‌విండో చైర్మన్ పెబ్బేటి కృష్ణయ్య, సింగిల్‌విండో డైరెక్టర్లు మునిసిపల్ మాజీ కౌన్సిలర్లు ప్రారంభించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లో ఏ గ్రేడ్ వరికి క్వింటాల్‌కు రూ.2320, బి గ్రేడ్ వరికి క్వింటాల్ రూ.2300 ధర రైతులకు చెల్లిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్లు పసుపుల నర్సింహ, తాళ్ల పరశురాంగౌడ్, వెంకటరెడ్డి, కొల్లాపూర్ ము నిసిపల్ మాజీ కౌన్సిలర్లు నరసింహారావు, ఎండీ నయ్యుం, కాంగ్రెస్ నాయకులు వంగ రాజశేఖర్ గౌడ్, మేకల కిరణ్‌కుమార్ యాదవ్, కర్నె వాసు, కమలాకర్ రావు రెడ్డి సత్యం, భీమ్‌శెట్టి, దిలీప్, పసుల వెంకటేష్, వెంకటయ్య, మహేష్ యాదవ్ పాల్గొన్నారు.

ఇబ్బంది లేకుండా కొనుగోలు చేయాలి

ఉప్పునుంతల : రైతులకు ఇబ్బంది లేకుండా వడ్లు ఎప్పటికప్పుడు నాణ్యత ప్రమాణాలు పరిశీలించి కొనుగోలు చేయాలని తహసీల్దార్ ప్రమీల అన్నారు. బుధవారం మండల పరిధిలోని పెనిమిళ్ల గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదే విధంగా కొరటికల్ గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు.

20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

తెలకపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 20న జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. బుధవారం తెలకపల్లి మండల కేంద్రంలోని వివిధ సంఘాల ముఖ్య నాయకులతో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలు, మతోన్మాద చర్యలు మరింత దూకుడుగా అమలు చేస్తోందని అన్నారు. గోపాస్‌లక్ష్మణ్, ఎం.విజయ్‌గౌడ్‌తో పాటు వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ కురుమూర్తి

వెల్దండ, మే 7 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ కురుమూర్తి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో నిర్వహిస్తున్న శృతిలయ కల్చరల్ అకాడమీ వేసవి శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ఎస్‌ఐ సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోసపూరిత ప్రకటనలకు దూరంగా ఉండాలని, గుర్తుతెలియని వారికి వ్యక్తిగత సంబంధిత ఆదార్‌నెంబర్‌లు, ఫోన్‌నెంబర్, ఓటీపీలు చెప్పవద్దని కోరారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు ఈ నేరాలపట్ల అప్రమత్తంచేయాలని కురుమూర్తి సూచించారు. కార్యక్రమంలో జోనల్ ఇంచార్జి శ్రీరాం, మండల ఇంచార్జి మల్లేష్, బ్రాంచ్ ఇంచార్జి శ్రీకళ, రవళి, కోఆర్డినేటర్లు పావని, ప్రేమలత, మహేశ్వరి ఉన్నారు.